క్లుప్తంగా

నిర్మాణాల్లో లోపాలు నివారించండి

కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో జరిగే సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. గంగానమ్మపేటలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగానమ్మపేటలోని గుడి రోడ్డును మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఆయన బస్టాండ్, అమరావతి ఫ్లాట్స్‌లోని మున్సిపల్ పార్కులను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన వసతులను పరిశీలించారు. ఆయన వెంట హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, అధికారులు ఉన్నారు.

తెనాలిలో పట్టపగలే చోరీ




తెనాలిరూరల్: తెనాలిలో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం భారీ దొంగతనం జరిగింది. మారిస్‌పేట మఠంబజారులోని మహాలక్ష్మీ గుడి ఎదురు గల ఇంట్లో కింద పోర్షన్‌లో నివసిస్తున్న షేక్ సుభానీ–షాహీనా బేగం ఇంట్లోకి చొరబడిన దుండగులు భారీగా నగలు, నగదు చోరీ చేసుకు వెళ్లారు. భర్త సుభానీ పనికి వెళ్లగా భార్య షాహీనా బేగం గురువారం ఉదయం 11.00 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పక్కింటి వారితో కలిసి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసే సరికి మెయిన్‌డోరుకు వేసి ఉన్న తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో బీరువా తలుపులు తెరిచి వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించిన ఆమె త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ప్రకాశరావు ఘటనాస్థలానికి వచ్చి ఇంట్లో పరిశీలించి బాధితుల నుంచి వివరాలు తీసుకున్నారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. బీరువాలో ఉన్న రూ. లక్షకు పైగా నగదు, సుమారు తొమ్మిది సవర్ల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని షాహీనా బేగం తెలిపారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు కృషి చేసింది. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో బకాయిలు చెల్లించి సహకరించండి



తెనాలి: పట్టణంలోని నెం.22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ బకాయిదారులు సకాలంలో బకాయిలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు కోరారు. బ్యాంకు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడు నెలల కాలంలో బ్యాంకు డిపాజిట్లు రూ.1.50 కోట్లకుపైగా పెరిగాయని, ఎన్‌పీఏ బకాయిలు కోటి రూపాయలకు పైగా వసూలు చేశామని తెలిపారు. ఏడాది కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 9 శాతం వడ్డీని ఇస్తున్నామని తెలిపారు. కేవలం 79 పైసల వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.5,300 ఇస్తున్నామని చెప్పారు. ఇళ్లు, ఇళ్లస్థలాలపై స్వల్పవడ్డీకి రుణాలను ఇస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలను కల్పిస్తున్నామని వివరించారు. బ్యాంక్ డైరెక్టర్లు శ్యామ్‌సన్, కొణిదెన నాగేంద్రరావు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఐఎల్ఎం ఉద్యోగాలకు ఏఎస్ఎన్ విద్యార్థులు



తెనాలి: బెంగళూరు కేంద్రంగా గల ప్రముఖ సంస్థ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్' (ఐఎల్ఎం)సంస్థ వరుసగా 18వ ఏట స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులు వంద మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఐఎల్ఎం సంస్థ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్‌ను పది రాష్ట్రాలకు చెందిన వివిధ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారు ఎంచుకునే రాష్ట్రాలవారీగా ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.21–26 వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు. సంస్థ వ్యవస్థాపకురాలు, అకడమిక్ డైరెక్టర్ రోనిలా కార్లో, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సంజయ్ సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ డిపార్టుమెంటు నుండి పాషా, సోమప్పలు ఎంపికలు చేశారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ రెండోవారంలో సంస్థలో చేరాల్సి ఉన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దాదాపు నూరు శాతం విద్యార్థులకు ఉపాధి లభించటం తమకు సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సులను చేయిస్తున్నందునే ఉద్యోగాలను పొందగలుగుతున్నారని చెప్పారు.

పేరులో చిన్నది - ఆహ్లాదంలో పెద్దది!

- రూ.70 లక్షల మున్సిపల్ నిధులతో పలు అభివృద్ధి పనులు
- అహ్లాదభరితంగా రూపుదిద్దుకున్న పార్కు
- చిన్నారులు, వాకర్స్‌తో నిండిపోతున్న పార్కు

తెనాలికే మణిహారం చినరావూరు పార్కు



చినరావూరులోని సత్యనారాయణ లేక్ పార్కు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణానికి మణిహారంగా చినరావూరులోని సత్యనారాయణ లేక్ పార్కు రూపుదిద్దుకుంది. దీనిలో పలు ఆట వస్తువులు, నూతన బోట్లు, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ.70 లక్షల మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి చేశారు. దీంతో చినరావూరు పార్కు అహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తోంది. తెనాలి చినరావూరులో మంచి నీటి చెరువు ఉండేది. దానిని నాటి పాలకులు పార్కుగా మార్పుచేయాలని భావించి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన రావి సత్యనారాయణ పేరును దీనికి ఏర్పాటు చేశారు. 1963లో నాటి మున్సిపల్ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య పార్కులో కృత్రిమ ద్వీపం, పడవ షికారు ఏర్పాటు చేశారు. అలాగే 1988లో అప్పటి చైర్మన్ డాక్టర్ రావి రవీంద్రనాథ్ సహకారంతో నూతనంగా నిర్మించిన బాల భవనంకు ముఖ్యమంత్రి జలగం వెంకగళరావు శంకుస్థాపన చేశారు. అలాగే చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన కొన్ని ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇది ఉడా పరిధిలో ఉండటంతో అప్పటి ఉడా చైర్మన్‌లు డాక్టర్ కొల్లి శారద, మల్లాది విష్ణులు దీనిలో కొన్ని వసతులు కల్పించారు. తర్వాత కాలంలో దీనిని మున్సిపాలిటీకి అప్పగించటంతో అప్పటి నుంచి దీనిలో మౌలిక వసతుల కల్పన దీని నిర్వహణ బాధ్యతలు మున్సిపాలిటీ చూస్తు వస్తోంది.

ఏర్పాటు చేసిన వసతులు ఇవి

పార్కు ఆవరణలో ఐలవ్‌యూ తెనాలి బోర్డు, ఏనుగు బొమ్మలు రెండు, బుద్ధుడు బొమ్మ ఒకటి, వాకింగ్ ట్రాక్‌కు గ్రానైట్ ఏర్పాటు, క్యాంటిన్‌కు ఆర్ట్ పెయింట్, నాలుగు కొత్త బోట్‌లు, చిన్నారులు ఆడుకునే 10 ఆట వస్తువులు, గ్రీనరీ, కుంగిన ఫ్లోరింగ్‌కు మరమత్తులు చేశారు. మ్యూజికల్ ఫౌంటెన్ రిపేరు చివరి దశలో ఉంది. ఆధునీకరణ పనులు పూర్తికావటంతో మంత్రి మనోహర్ ఇటీవల దీనిని ప్రారంభించారు. అలాగే కొద్దిరోజులు ఎటువంటి రుసుం లేకుండా అందరికీ అనుమతిస్తుండటంతో వచ్చే వారి సంఖ్య పెరిగింది. మొత్తం మీద చినరావూరులోని మున్సిపల్ లేక్ పార్కు సుందరంగా, అహ్లాదభరితంగా తయారు అయిందనటంతో ఎటువంటి సందేహం లేదు.

రూ.70 లక్షలతో పలు అభివృద్ధి పనులు

చినరావూరు పార్కులో గతంలో వాకింగ్ ట్రాక్, మ్యూజికల్ ఫౌంటెన్, పడవ షికార్, పిల్లలు ఆడుకునే కొన్ని ఆట వస్తువులు, ద్వీపం చుట్టు వంతెన, ఫుడ్ కోర్టు, ల్యాండ్ స్కేపింగ్, లైటింగ్, విడియో గేమ్స్ పార్లర్ వంటి వాటిని ఏర్పాటు చేశారు. తెనాలి పట్టణంలో ఆహ్లాదంను అందించే పార్కు కావటంతో దీనిని మరింత అభివృద్ధి చేయాలని పాలకులు భావించారు. దీనిలో భాగంగా గత శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఫ్లోరింగ్, వాకింగ్ ట్రాక్ వంటివి చేయించారు. పార్కు అభివృద్ధికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రూ.70 లక్షలు నిధులను మున్సిపాలిటీ నుంచి వెచ్చించేలా చర్యలు చేపట్టారు. దీనిలో రూ.15 లక్షలు 15వ ఆర్థిక సంఘ నిధులతో పాటు మిగిలిన రూ.55 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి కేటాయించారు.



నూతనంగా కొనుగోలు చేసిన బోట్లు



పిల్లలు ఆడుకుంటున్న ఆటవస్తువులు

పార్కులో అన్ని వసతుల ఏర్పాటుకు చర్యలు



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నాటి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్, ప్రస్తుత శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్ సహకారంతో పార్కులో అనేక మౌలిక వసతులు ఏర్పాటు చేయటం జరిగింది. ప్రస్తుతం రూ.70 లక్షల మున్సిపల్ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో కూడ పార్కు అభివృద్ధికి కృషి చేస్తాం.

–తాడిబోయిన రాధిక,
చైర్‌పర్సన్, తెనాలి పురపాలక సంఘం.

అందరి సహకారం వల్లే...



నేను కౌన్సిలర్‌గా ఎన్నికైన తర్వాత పార్కుపై ప్రత్యేక దృష్టిని పెట్టాం. దాతల సహకారంతో మంచినీటి వసతి, పిల్లలు ఆడుకునే వస్తువులు ఏర్పాటు చేశాం. పార్కు అభివృద్ధిపై మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి పాలకులు, అధికారుల సహకారంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దగలిగాం. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు.

–గుంటూరు కోటేశ్వరరావు,
వైఎస్సార్ సీపీ కౌన్సిలర్

రేపటి నుంచి ఏడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు



తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్ లోని శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 8 తేదీ నుండి 14 తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను గురువారం ఆలయ ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, వాహన సేవలు ఉంటాయని చెప్పారు. తొలిరోజున అంకురారోపణ, ధ్వజారోహణ, 9న శ్రీసీతారాములవారి కళ్యాణం, శ్రీతిరుచ్చి వాహనసేవ, 10న శ్రీసూర్యప్రభ వాహనసేవ, శ్రీచంద్రప్రభ వాహన సేవ, 11న శ్రీమైనాక వాహనసేవ, శ్రీసువర్చలా హనుమత్ కళ్యాణం, 12న శ్రీవారి రథోత్సవం వేడుకగా జరుగుతాయని తెలిపారు. 13న శ్రీచక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, ద్వాదవ ప్రదక్షిణ, 14న పుష్పోత్సవం ఉంటాయని వివరించారు. ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శ్యాండిల్య, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు భవిష్యత్‌లో మేలు



శివకుమార్, గోల్డ్ రహిమాలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా సత్కార సభలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీకి అండగా ఉంటూ బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్న కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా మేలు జరుగుతుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలికి చెందిన మైనార్టీ నాయకుడు గోల్డ్ రహిమా వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా గురువారం స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు జిల్లా కమిటీలో బాధ్యతలు స్వీకరిస్తున్న రహిమాను అభినందించారు. ప్రజాసమస్యలను పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా తన ప్రసంగంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎందరో పేదలకు మేలు చేకూర్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికల్లో సూపర్‌సిక్స్ హామీలనిచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయటం లేదన్నారు. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ప్రజల మనసులను గెలిచేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. తన పదవికి కారకులైన మాజీ ఎమ్మెల్యే శివకుమార్, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తెలప్రోలు సర్పంచ్ బాషా, టిక్స్ బాల, మున్సిపల్ కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తోట రఘురాం, కుర్రా సుజాత, యాతాటి అనిల్, మల్లెబోయిన రాము, పెదలంక వెంకటేశ్వర్లు, ఫరీద్, షాజహాన్, గౌస్, ఎం.బాజీ, మున్నా, గౌస్, చింకా సురేష్, కావేటి నిర్మల, సిరికృష్ణ, షేక్ మీరావలి, కాలేషా, కుర్రా శ్రీను, గురునాథగుప్తా, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్‌బాబు, జకీరా, ఇదిరా ప్రియదర్శిని, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ అడిగితే దాడి చేశాడు

తెనాలిరూరల్: బాకీ విషయమై యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలి చినరావూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ సాధిక్ బావ ఇదే ప్రాంతానికి చెందిన షేక్ రెహమాన్ తల్లికి కొంత నగదు అప్పుగా ఇచ్చాడు. బాకీ విషయమై సాధిక్, రెహమాన్ ఘర్షణ పడగా రెహమాన్ సాధిక్‌పై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు యూనిక్ ఐడీ నంబరు కేటాయింపు

- రైతుసేవా కేంద్రాల్లో ఐడీ రిజిస్ట్రేషన్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు ఉషారాణి



తెనాలి: ప్రతి పౌరుడికి ఆధార్ కార్డులాగ రైతులకు యూనిక్ ఐడీ నంబరును ప్రభుత్వం రిజిస్టరు చేస్తుందని తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఉషారాణి చెప్పారు. భూమి యజమానులు తమ ఆధార్ కార్డు, 1బి అడంగల్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో తమకు దగ్గర్లోని రైతుసేవాకేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషను పూర్తిచేసి యూనిక్ ఐడీ నంబరును నమోదుచేస్తారని తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రైతులకు యూనిక్ ఐడీ కార్డు ప్రక్రియను ప్రారంభించమంటూ వ్యవసాయశాఖ కమిషనర్, డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ముందుగా కొన్ని రైతుసేవా కేంద్రాల్లో ఈ ప్రక్రియను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి, లోటుపాట్లను సరిచేసి, ఇప్పుడు అన్నిచోట్లా రైతు రిజిస్ట్రేషనును ఆరంభించినట్టు చెప్పారు. శాశ్వతంగా ఉండే గుర్తింపు అయినందున రైతుసోదరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ సబ్‌డివిజను పరిధిలోని తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో రైతులు రబీలో 49,800 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారని ఉషారాణి చెప్పారు. 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 20 వేల ఎకరాల్లో జొన్న, 9,800 ఎకరాల్లో మినుము, పెసర పంటలు సాగులో ఉన్నాయని తెలిపారు. మినుము, పెసర పైర్లు 30 రోజుల దశలో జొన్న, మొక్కజొన్న 40–60 రోజుల దశలో ఉన్నాయని చెప్పారు. స్వల్పంగా అక్కడక్కడా తెగుళ్ల ఆశించినప్పటికీ తగిన యాజమాన్య చర్యలతో రైతులు నివారించుకున్నారని తెలిపారు. ఇకపోతే పంటలు సాగులో ఉన్న పంటపొలాలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదును పూర్తిచేశామని ఉషారాణి చెప్పారు. సంబంధిత రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు. దుగ్గిరాలలో 80 శాతం, కొల్లిపరలో 88 శాతం, తెనాలిలో 85 శాతం రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని చెబుతూ మిగిలిన రైతులంతా తమకు దగ్గర్లోని రైతుసేవాకేంద్రాలకు వెళ్లి తంబ్ వేసి, ఈకేవైసీ పూర్తిచేయించుకోవాలని ఆమె సూచించారు.

నోటీసు కొరకు ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Between:- OS. 31/2021
Kolla Veeraiah ... వాది
And
Vattikuti Satyaharischandra Prasad ... ప్రతివాది
To
Vattikuti Satyaharischandra Prasad
S/o Late V. Subbarao, Door No. 32-1-18, Near JMJ College, Sarala Nagar, Tenali, Guntur Dist.
[illegible] తేది.21 02 2025వ తేదీకి [illegible]
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా- 21-02-2025
M. హరిబాబు
వాది తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ నెం. 9948363568

కోర్టు వేలం ప్రకటన
[illegible]
వేలం తేది : 28-02-2025
[illegible] తేది : 07-03-2025
[illegible] రూ.40,00,000/-
[illegible] రూ.12,00,000/-
[illegible]
మార్కెట్ విలువ : రూ.[illegible]/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
[illegible]
డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్.
సెల్ నెం.7799300281

రజక చెరువు ఆధునికీకరణపై విచారణకు ఆదేశం

- నాసిరకం పనులతో అవకతవకలకు పాల్పడ్డారని అభియోగం
- నాటి ఇంజినీరింగ్ ఏఈ, ఈఈలపై విచారణకు జీవో విడుదల

తెనాలి: పట్టణంలోని రజక చెరువు ఆధునికీకరించి, సుందరీకరణ చేసిన పనుల్లో నాణ్యతాలోపంతో అవకతవకలకు పాల్పడ్డారన్న విజిలెన్స్ ఆరోపణలపై క్రమశిక్షణ చర్యల నిమిత్తం ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఏపీసీఎస్ (సీసీ అండ్ ఏ) నిబంధన–20 ప్రకారం అప్పట్లో తెనాలి మున్సిపాలిటి ఏఈ ఈ.శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కేఆర్‌కే సత్యనారాయణ (ప్రస్తుతం రిటైరయ్యారు)పై విచారణకు ఆదేశిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ జీవో జారీచేశారు. విచారణ అధికారిగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషనులో సూపరింటెండెంట్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావును నియమించారు. కేసులో తగిన రికార్డులను విచారణ అధికారి ఎదుట ఉంచాల్సిందిగా ప్రస్తుత తెనాలి మున్సిపల్ కమిషనరు బండి శేషన్నను ప్రెజెంటింగ్ అధికారిగా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (విజి.11) డిపార్టుమెంటు జీవో ఆర్‌నెం.75ను జారీచేశారు. తాడేపల్లిలోని ప్రజారోగ్యశాఖ ఇంజినీరింగ్–ఇన్–చీఫ్ నుండి సంబంధిత రికార్డులన్నింటినీ సేకరించి, విచారణ అధికారికి సమర్పించాల్సిందిగా ప్రెజెంటింగ్ అధికారిని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 2014–19 మధ్యకాలంలో టీడీపీ హయాంలో రజక చెరువు ఆధునికీకరణ, సుందరీకరణ పనులు జరిగాయి.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ఆర్డీవో నేలపు రామలక్ష్మి



వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచనలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

రేపల్లె రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో నేలపు రామలక్ష్మి హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలపై సాన్కింగ్ సెంటర్ల నిర్వాహకులు, డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులతో రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి స్కానింగ్ సెంటరుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరన్నారు. ఆర్ఎంపీ వైద్యుడు సూచించిన వారికి స్కానింగ్‌లు చేయరాదన్నారు. ప్రతి స్కానింగ్ సెంటరులో రికార్డులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. స్కానింగ్ సెంటరుకు వచ్చిన గర్భిణుల వివరాలు, రిఫర్ చేసిన వైద్యశాల, వైద్యశాల వైద్యుడి వివరాలు తప్పనిసరిగా రికార్డులలో పొందుపరచాలన్నారు. రికార్డు నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. పీహెచ్‌సీలలో హైరిస్క్ ఉన్న కేసులను 108 సహాయంతో సమీపంలోని సీహెచ్‌సీలకు, జీజీహెచ్‌లకు పంపించాలన్నారు. ప్రతి ప్రభుత్వ జూనియర్, డిగ్రి కళాశాలలో లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఎస్టీ కాలనీలలో బాల్య వివాహాల నిరోధానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చదువు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. తరచుగా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఎస్పీ ఆవుల సాంబశివరావు, వైద్యులు భూషణరావు, వసంతం వీరరాఘవయ్య, సుధాకర్, శ్వేత, కృష్ణ, చైతన్య, రమేష్, జాన్‌ప్రసాద్, షేక్ షాహీన్, సభ్యులు పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పుతోనే సమాజంలో గౌరవం

సంచార జాతుల అవగాహన సదస్సులో కేసీ బసవయ్య



మాట్లాడుతున్న కేసీ బసవయ్య

తెనాలి: మనిషిని మనిషిగా గౌరవం పొందాలంటే మన జీవన విధానంలో మార్పు రావాలని పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కేసీ బసవయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో గురువారం తెనాలి పట్టణ పరిధిలోని కఠెవరం కాల్వకట్టపై గల ఎస్టీ కాలనీలో సంచార జాతుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, కష్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సుకు డీబీఆర్‌సీ కో–ఆపరేటివ్ సొసైటీ సూపర్‌వైజర్ బందెల రమేష్ అధ్యక్షత వహించారు. బసవయ్య మాట్లాడుతూ చెత్తను సేకరించటమే ఉపాధిగా జీవిస్తున్న కుటుంబాల్లో మార్పు రావాలంటే, వారంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుభాని మాట్లాడుతూ ఈ–శ్రమ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ తీసుకునే వారు మినహా మిగిలిన ప్రతిఒక్కరూ కార్డులు పొందాలని, భవన నిర్మాణ కార్మికులు ఐదు సంవత్సరాలకు రూ.110 చెల్లించి కార్డు తీసుకోవాలని సలహానిచ్చారు. పనిచేస్తున్న క్రమంలో ఏదైనా ఇబ్బందులు జరిగితే ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం చేస్తుందని ఈ రెండు కార్డులను ప్రతి ఒక్కరు తీసుకొని ఉపయోగ పెట్టుకోవాలని కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ప్రముఖ న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, సీహెచ్ రాజారావు, సాంబశివరావు, మహిళా పోలీస్ దేవి, సంస్థ ఏరియా కో–ఆర్డినేటర్ రాజశేఖర్, సంచార విముక్తి జాతులు, వేస్ట్ పిక్కర్స్, ఎయిర్ పిక్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇసుక రీచ్‌లు



అక్రమ తవ్వకాలు జరగకుండా గుంతలను తవ్విన అధికారులు

కొల్లిపర: కూటమి ప్రభుత్వం ఇటీవలన మూడు ప్రవేటు కంపెనీలకు మండలంలోని కృష్ణా నదిలో మున్నంగి, బొమ్మువానిపాలెం 14,15 గల ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. ఈక్రమంలో గురువారం వారికి ఇచ్చిన అనుమతులు గడువు ముగిసి పోవడంతో తహసీల్దారు జి.సిద్ధార్థ, ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆయా ఇసుక రీచ్‌ల వద్ద ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకుండా మిషన్ ద్వారా గుంటలు తీయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు ఇచ్చిన గడువు నేటితో పూర్తి కావటంతో ఎవరూ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో నిన్నటి వరకు డంపింగ్ చేసిన సంఘటనా స్థలంలో యంత్రాలు ద్వారా గుంతలు తీయించారు. ఈ గుంతలు ఎవరైనా పూడ్చి ఇసుక తరలించటం వంటి సంఘటలకు పాల్పడితే చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.